సాక్షి
రాజన్న సిరిసిల్ల
బుధవారం । 20 । మార్చి । 2024



ఎల్‌ఎండీకి నీటి విడుదల

బోయినపల్లి(చొప్పదండి): మిడ్‌మానేరు నుంచి ఎల్‌ఎండీకి మంగళవారం 1385 క్యూసెక్కుల నీరు విడుదల చేస్తున్నారు.



రంజాన్ వేళలు

ఇఫ్తార్	సహర్
బుధ 6:33	గురు 4:59

గరిష్టం/కనిష్టం
34.0/22.0

వాతావరణం

ఆకాశం మేఘావృతమవుతుంది. చిరు జల్లులు పడే అవకాశం ఉంది. ఈదురు గాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

నేటి సదరం శిబిరాలు రద్దు

● డీఆర్‌డీవో శేషాద్రి

సిరిసిల్ల: జిల్లా ఆస్పత్రిలో బుధవారం నిర్వహించాల్సిన ఆర్థోపెడిక్ సదరం శిబిరాన్ని రద్దు చేసినట్లు జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి శేషాద్రి మంగళవారం తెలిపారు. సాధారణ ఎన్నికల నోటిఫికేషన్ నేపథ్యంలో ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చిందన్నారు. ముందు ప్రకటించిన ప్రకారం 20, 22వ తేదీల్లో నిర్వహించాల్సిన సదరం శిబిరాలు రద్దయినట్లు గుర్తించాలని కోరారు. ఆయా తేదీల్లో స్లాట్ బుక్ చేసుకున్న వారు తర్వాత జరిగే శిబిరానికి రావాలని తెలిపారు.

నేత కార్మికులది దయనీయ పరిస్థితి

● తెలంగాణ చేనేత ఐక్యవేదిక అధ్యక్షుడు వీరమోహన్



మాట్లాడుతున్న వీరమోహన్

సిరిసిల్లటౌన్: వస్త్రపరిశ్రమ సంక్షోభంతో సిరిసిల్లలోని చేనేత, నేతకార్మికుల పరిస్థితి దయనీయంగా తయారైందని తెలంగాణ చేనేత ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు రాపోలు వీరమోహన్ ఆవేదన వ్యక్తం చేశారు. సిరిసిల్ల ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం కార్మికుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వ ఆర్డర్లను అందించిందని, కొత్తగా ఏర్పడిన కాంగ్రెస్ సర్కారు కూడా కార్మికుల సంక్షేమాన్ని గుర్తించి అలాంటి పాలసీలు తీసుకురావాలని కోరారు. పనుల్లేక కార్మికులు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారన్నారు. ఇటీవల బలవన్మరణానికి పాల్పడిన నేత కార్మికుడు శ్రీనివాస్ కుటుంబానికి రూ.10లక్షలు ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని కోరారు. బాధిత కుటుంబానికి ఐక్యవేదిక ఆధ్వర్యంలో రూ.55వేలు, 25కిలోల బియ్యం అందించారు. కోమటిపల్లి సదానందం, శ్రీగాధ మైసయ్య తదితరులు పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాలపై పోలీసులకు ఫిర్యాదు

ముస్తాబాద్(సిరిసిల్ల): ముస్తాబాద్ మండల కేంద్రంలో నిబంధనలకు విరుద్ధంగా చేపట్టిన నిర్మాణాలపై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్ తెలిపారు. ప్రత్యేకాధికారి, తహసీల్దార్ ఆదేశాలతో అనుమతులకు విరుద్ధంగా సాగే పనుల నిలిపివేతకు ఫిర్యాదు చేసినట్లు పేర్కొన్నారు.

జిల్లా పంచాయతీ అధికారికి ఫిర్యాదు

ముస్తాబాద్‌లో అక్రమంగా సెల్లార్లు నిర్మిస్తున్నారని కాంగ్రెస్ సీనియర్ నాయకుడు వేముల సత్యంగౌడ్ డీపీవో వీరబుచ్చయ్యకు ఫిర్యాదు చేశారు. సత్యంగౌడ్ మాట్లాడుతూ అనుమతులకు విరుద్ధంగా సెల్లార్ల నిర్మాణాలు జరుగుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. ప్రత్యేకాధికారితోపాటు పంచాయతీ కార్యదర్శికి ఫిర్యాదు చేసినా చర్యలు తీసుకోలేదని, అక్రమ లేఅవుట్లపై విచారణ చేయాలని కోరారు.

చెత్త సేకరణలో అలసత్వం వద్దు



శాంతినగర్‌లో పారిశుధ్య పనులు పరిశీలిస్తున్న అడిషనల్ కలెక్టర్, కమిషనర్

సిరిసిల్లటౌన్: సిరిసిల్లలో ప్రణాళికాబద్ధంగా పారిశుధ్యం పనులు చేపట్టాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ పూజారి గౌతమి మున్సిపల్ అధికారులను ఆదేశించారు. జిల్లా కేంద్రంలోని సుభాష్‌నగర్, శాంతినగర్, అంబేడ్కర్‌నగర్ ప్రాంతాల్లో మంగళవారం శానిటేషన్ స్పెషల్ డ్రైవ్ చేపట్టారు. స్థానికులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. మున్సిపల్ కమిషనర్ డి.లావణ్య, శానిటరీ ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ పాల్గొన్నారు.

మాజీ సర్పంచ్‌కు నోటీసులు

సాక్షి ఎఫెక్ట్..

తంగళ్లపల్లి(సిరిసిల్ల): మండలంలోని చింతలఠాణా మాజీ సర్పంచ్ గుర్రం సత్తయ్యకు పంచాయతీశాఖ నుంచి మంగళవారం నోటీసులు జారీచేశారు. 'మాజీ సర్పంచ్‌పై డీపీవోకు ఫిర్యాదు' పేరుతో 'సాక్షి' కథనం ప్రచురించింది. సదరు మాజీ సర్పంచ్ గ్రామపంచాయతీకి చెందిన 500 పైపులను సొంతానికి వినియోగించుకున్నాడనే విషయం ఆలస్యంగా వెలుగు చూసిందని తెలిపింది. 'సాక్షి' కథనంతో స్పందించిన పంచాయతీరాజ్‌శాఖ అధికారులు జేసీబీల ద్వారా తవ్వి తీసిన గ్రామపంచాయతీ పైపులను గ్రామపంచాయతీకి అప్పగించాలని లేనిపక్షంలో చట్టపరమైన చర్యలు తీసుకుంటామని నోటీసుల్లో పేర్కొన్నారు.



కవ్వంపల్లి సత్యనారాయణ | మేడిపల్లి సత్యం | చింతకుంట విజయరమణారావు | ఆది శ్రీనివాస్

సిరిసిల్లలోనూ సర్వర్ రూం

● ఫోన్ ట్యాపింగ్ కేసులో కొత్తకోణం
● నలుగురు సిబ్బందితో ప్రణీత్‌రావు ప్రత్యేక నిఘా



ప్రణీత్‌రావు

సాక్షిప్రతినిధి, కరీంనగర్:

రాష్ట్రవ్యాప్తంగా సంచలనం రేపిన ఫోన్ ట్యాపింగ్ కేసులో మరో కొత్త విషయం బయటపడింది. ఈ కేసులో తీగ లాగిన కొద్దీ దర్యాప్తు అధికారులకు కొత్త విషయాలు తెలుస్తున్నాయి. సస్పెండెడ్ డీఎస్పీ ప్రణీత్‌రావు ఫోన్ ట్యాపింగ్ కోసం సిరిసిల్లలోనూ ప్రత్యేక ఏర్పాటు చేసినట్లు సమాచారం. తాజాగా ఈ కేసులో ప్రణీత్‌రావుకు సహకరించిన వారందరినీ ఒక్కొక్కరిగా అరెస్టు చేస్తున్నారు. ట్యాపింగ్ ఉదంతం వెలుగుచూసిన కొత్తలోనే హైదరాబాద్‌లోని ఎస్‌ఐబీ కార్యాలయం కేంద్రంగా ఈ వ్యవహారం జరిగిందని అనుకున్నా.. తర్వాత వివిధ జిల్లాల్లోనూ జరిగినట్లు అధికారులు గుర్తించారు. ఈ క్రమంలోనే ప్రణీత్‌రావు సిరిసిల్లలోనూ ట్యాపింగ్ కోసం ప్రత్యేకంగా సర్వర్‌రూం, ఎస్సై నేతృత్వంలో ముగ్గురు కానిస్టేబుళ్లను నియమించినట్లు తెలిసింది. వాస్తవానికి 2021లోనే కరీంనగర్ వేదికగానే పీసీసీ అధ్యక్షుడు, ప్రస్తుత సీఎం రేవంత్ ప్రణీత్‌రావు ఉదంతాన్ని బయటపెట్టి సంచలనం రేపారు. తనను, తన కుటుంబ సభ్యులను లక్ష్యంగా చేసుకుని ఫోన్లు ట్యాపింగ్ చేస్తున్నారని ఆరోపించారు. తాజాగా అదే ఆరోపణలపై పంజగుట్టలో కేసు నమోదు కావడం, డీఎస్పీ ప్రణీత్‌రావు అరెస్టుకావడం, ఇందుకు సంబంధించి ఆయనకు సహకరించిన సిబ్బందిని కూడా పోలీసులు ప్రశ్నిస్తుండటం గమనార్హం.

సిరిసిల్ల కేంద్రంగా..

సిరిసిల్లలో ప్రణీత్‌రావు ఆదేశాల మేరకు పనిచేసిన సిబ్బందిని సైతం కేసు దర్యాప్తు చేస్తున్న పంజగుట్ట పోలీసులు విచారించే అవకాశాలున్నాయి. వరంగల్‌లో ఒకటి, సిరిసిల్లలో మరో సర్వర్ ఏర్పాటు చేసినట్లు దర్యాప్తు అధికారులు గుర్తించారు. సీఎం సన్నిహితుడు, కరీంనగర్‌కు చెందిన కాంగ్రెస్ సీనియర్ లీడర్ సత్తు మల్లేశ్ ఫోన్ ట్యాపింగ్ చేసినట్లు అనుమానిస్తున్నారు. ప్రణీత్‌రావు డిలీట్ చేసిన చాటింగ్ రీట్రీవ్‌లో సత్తు మల్లేశ్ కాంటాక్ట్ వెలుగుచూడటం గమనార్హం. సత్తు మల్లేశ్ ఫోన్ ద్వారా ఉమ్మడి జిల్లాకు చెందిన ఎమ్మెల్యేలు ఆది శ్రీనివాస్, కవ్వంపల్లి సత్యనారాయణ, మేడిపల్లి సత్యం, అడ్లూరి లక్ష్మణ్, చింతకుంట విజయరమణారావుల సంభాషణలు విన్నారని అనుమానిస్తున్నారు. సిరిసిల్లలోని సర్వర్ రూం ఆధారంగానే ఉమ్మడి జిల్లాలోని ప్రతిపక్ష నేతల ఫోన్లు ట్యాప్ చేశారని భావిస్తున్నారు. అయితే, వీరు కేవలం రాజకీయ నాయకుల ఫోన్లే ట్యాప్ చేశారా? జాబితాలో ఇతరులు కూడా ఉన్నారా? అన్న విషయం తెలుసుకునే పనిలో పోలీసులు నిమగ్నమయ్యారు. గతేడాది డిసెంబర్ 4వ తేదీన ప్రభుత్వం మారడంతో ప్రణీత్‌రావు బేగంపేట ఎస్‌ఐబీ కార్యాలయంలోని సర్వర్ రూంలోని అన్ని ఆధారాలు ధ్వంసంచేశాడు. అందులో భాగంగా సిరిసిల్ల సర్వర్‌లోని ఆధారాలను కూడా దొరకుండా చేసి ఉండొచ్చని అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. వీటిని నాశనం చేసే ముందే ప్రణీత్‌రావు ఆ వివరాలను పెన్‌డ్రైవ్‌ల ద్వారా కాపీ చేసుకున్నాడని పోలీసులు అనుమానిస్తున్నారు.

ఎన్నికల మార్గదర్శకాలపై అవగాహన ఉండాలి

● విధులు సమర్థంగా నిర్వహించాలి
● ఎన్నికల్లో సెక్టార్ అధికారులది కీలకపాత్ర
● కలెక్టర్, ఎన్నికల అధికారి అనురాగ్ జయంతి



మాట్లాడుతున్న కలెక్టర్ అనురాగ్ జయంతి

సిరిసిల్ల: ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలపై పూర్తి అవగాహనతో విధులు సమర్థంగా నిర్వహించాలని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి అనురాగ్ జయంతి కోరారు. కలెక్టరేట్‌లో మంగళవారం ఎస్పీ అఖిల్ మహాజన్‌తో కలిసి సెక్టార్, పోలీస్ అధికారులతో సంయుక్తంగా సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల విధులు నిర్లక్ష్యం చేస్తే పరిణామాలు తీవ్రంగా ఉంటాయని హెచ్చరించారు. జిల్లాలో 57 సెక్టార్లు, 547 పోలింగ్‌కేంద్రాలు ఉన్నాయని వివరించారు. పోలింగ్ కేంద్రాల రూట్‌లను ముందస్తుగా పోలీసు అధికారులతో కలిసి సెక్టార్ అధికారులు పరిశీలించాలని సూచించారు.

పారదర్శకంగా ఎన్నికలు

పార్లమెంట్ ఎన్నికలు పారదర్శకంగా నిర్వహించాలని కలెక్టర్ కోరారు. అర్హులను ఓటర్లుగా నమోదు చేయడం, సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను గుర్తించడం, మాక్‌పోల్ నిర్వహణ, కేంద్రాలలో వసతుల కల్పన, సకాలంలో రిపోర్టులు అందజేయడం, రిజర్వ్ ఈవీఎంల నిర్వహణ, పోలింగ్ సమయంలో ఈవీఎంలు మొరాయిస్తే వెంటనే కొత్తవి సమకూర్చడం వంటి బాధ్యతలు సెక్టారు అధికారులపై ఉంటుందని వివరించారు. పోలింగ్ కేంద్రాల్లో తాగునీరు, టాయిలెట్లు, ర్యాంపులు, ఓటర్లకు నీడ కల్పించడం, మాక్ పోలింగ్ నిర్వహణపై అవగాహన కల్పించారు. ఎన్నికల విధులపై సందేహాలుంటే ముందే నివృత్తి చేసుకోవాలని సూచించారు. ఎస్పీ అఖిల్ మహాజన్ మాట్లాడుతూ ప్రజలతో మర్యాదగా ప్రవర్తించాలని, విధి నిర్వహణలో అలసత్వం వహించొద్దన్నారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను గుర్తించి ముందు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అదనపు కలెక్టర్లు పి.గౌతమి, ఎస్.ఖీమ్యానాయక్, సిరిసిల్ల, వేములవాడ ఆర్డీవోలు రమేశ్, రాజేశ్వర్ పాల్గొన్నారు.

వెల్‌కమ్ షాడో



జాగిలం షాడోను పరిశీలిస్తున్న ఎస్పీ

సిరిసిల్లక్రైం: మొయినాబాద్‌లోని ఐటీఏలో ఎనిమిది నెలల శిక్షణ పూర్తి చేసుకొని జిల్లాకు వచ్చిన పోలీస్ జాగిలం 'షాడో'కు పోలీస్‌శాఖ వెల్‌కమ్ పలికింది. పేలుడు పదార్థాలను గుర్తించడంలో షాడో ప్రత్యేక శిక్షణ తీసుకుంది. ఈ సందర్భంగా ఎస్పీ అఖిల్‌మహాజన్ షాడోతోపాటు ఇప్పటికే జిల్లా పోలీస్‌శాఖలో పనిచేస్తున్న ఆరు జాగిలాలకు ప్రత్యేక వసతులు కల్పించాలని సూచించారు. షాడోకి హ్యాండ్లర్‌గా వ్యవహరిస్తున్న ఏఆర్ కానిస్టేబుల్ కిరణ్, ఇతర డాగ్‌స్క్వాడ్ అధికారులు, సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఆర్‌ఐలు యాదగిరి, మధుకర్, రమేశ్ ఉన్నారు.



ధాన్యం రాలింది.. కన్నీరు మిగిలింది

జిల్లాలో సోమవారం సాయంత్రం ఈదురుగాలులతో కూడిన వడగండ్ల వానకు వరిపంట తూడ్చుకుపోయింది. స్తంభాలు విరిగిపోయాయి. బారీ నష్టం జరిగింది.

- వివరాలు 8లో

వడగండ్ల బాధిత రైతులను ఆదుకోవాలి

● మృతిచెందిన రైతు కుటుంబానికి రూ.10లక్షల పరిహారం ఇవ్వాలి
● మాజీ ఎంపీ వినోద్‌కుమార్



మంత్రి తుమ్మలతో ఫోన్‌లో మాట్లాడుతున్న వినోద్

సిరిసిల్ల/ముస్తాబాద్(సిరిసిల్ల): వడగండ్ల వానతో పంట పోయిందని రైతులు ఏడుస్తున్నారని, బాధిత రైతులను ఆదుకోవాలని మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్ కోరారు. ముస్తాబాద్, తంగళ్లపల్లి మండలాల్లో వడగండ్ల వానతో దెబ్బతిన్న పంట పొలాలను పరిశీలించిన అనంతరం సిరిసిల్లలోని తెలంగాణ భవన్‌లో విలేకరులతో మాట్లాడారు. నష్టపోయిన రైతులకు తక్షణ సాయంగా ఎకరానికి రూ.10 వేలు ఇవ్వాలని కోరారు. ఇలాంటి సందర్భాల్లో కేసీఆర్ ముఖ్యమంత్రి హోదాలో అనేక పర్యాయాలు ఆదుకున్నారని గుర్తు చేశారు.

రైతులపై కేసులు పెట్టడం ఏంటి?

పొలాలు ఎండిపోతున్నాయని, కాల్వలకు మోటార్లు పెట్టుకుని నీళ్ల పెట్టుకుంటే పోలీసులు కేసులు పెట్టడం ఏమిటి? అని వినోద్‌కుమార్ ప్రశ్నించారు. ముస్తాబాద్ మండలం గన్నెవానిపల్లె, సేవాలాల్‌తండాలో రైతులు కాల్వకు మోటార్లు పెట్టారని పోలీసులు కేసులు నమోదు చేశారని తెలిపారు. ఇప్పటికే నీళ్ల లేక పంటలు ఎండిపోతున్నాయని రైతులు ఏడుస్తుంటే.. పొలాలకు నీళ్ల పెట్టేందుకు సొంతంగా పైపులు వేసుకుని మోటార్లు పెట్టుకుంటే కేసులు నమోదు చేయడాన్ని ఖండించారు. ఇది కాంగ్రెస్ మార్క్ పాలన అని విమర్శించారు. సీఎం రేవంత్‌రెడ్డి, ఇరిగేషన్ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి జిల్లా కలెక్టర్, ఎస్పీలతో మాట్లాడి రైతులపై పెట్టిన కేసులు తొలగింపజేయాలని డిమాండ్ చేశారు.

మంత్రితో ఫోన్‌లో మాట్లాడిన వినోద్‌కుమార్

రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావుతో వినోద్‌కుమార్ ఫోన్‌లో మాట్లాడారు. జిల్లాలో వడగండ్ల వానలతో నష్టపోయిన రైతుల బాధలను మంత్రికి వివరించారు. మృతి చెందిన ఎల్లయ్య కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని, పంట నష్టపోయిన రైతులకు పరిహారం ఇవ్వాలని కోరారు. జెడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ, టెస్కాబ్ చైర్మన్ కొండూరి రవీందర్‌రావు, మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, టీపీటీడీసీ మాజీ చైర్మన్ గూడూరి ప్రవీణ్, బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు జిందం చక్రపాణి, నాయకులు బొల్లి రామ్మోహన్, కుంబాల మల్లారెడ్డి, జక్కుల నాగరాజు, న్యాలకొండ రాఘవరెడ్డి, ప్యాక్స్ చైర్మన్‌లు నర్సయ్య, రామ్మోహన్‌రావు, జక్కుల యాదగిరి, శ్రీనాథ్ గౌడ్, మల్లెంకి శ్రీనివాస్, చిలుక పెంటయ్య, సత్యనాయక్, సంపత్ తదితరులు పాల్గొన్నారు.

క్షేత్రస్థాయిలో పరిశీలన

ముస్తాబాద్‌లో వడగండ్లతో నష్టపోయిన పంట పొలాలను, పడిపోయిన విద్యుత్ స్తంభాలను పరిశీలించారు. మృతి చెందిన రైతు కుటుంబాన్ని పరామర్శించారు. ఎంపీపీ శరత్‌రావు, సెస్ డైరెక్టర్ అంజిరెడ్డి, నాయకులు కల్వకుంట్ల గోపాల్‌రావు, అక్కరాజు శ్రీనివాస్, విజయరామారావు, సర్వర్, నర్సింహారెడ్డి, నర్సయ్య, సంతోష్‌రావు, మనోహర్, స్వామి తదితరులున్నారు.

అక్రమార్కులపై నిఘా

● జిల్లాలో ఆరు చెక్‌పోస్టులు
● ఎస్పీ అఖిల్ మహాజన్



సిబ్బందికి సూచనలిస్తున్న ఎస్పీ అఖిల్ మహాజన్

సిరిసిల్లక్రైం: లోక్‌సభ ఎన్నికల దృష్ట్యా జిల్లా సరిహద్దులలో ఆరు చెక్‌పోస్టులు ఏర్పాటు చేసినట్లు ఎస్పీ అఖిల్ మహాజన్ తెలిపారు. మద్యం, డబ్బు ఇతరత్రాలు అక్రమ రవాణా, అసాంఘిక కార్యకలాపలు జరగకుండా చర్యలు తీసుకున్నట్లు పేర్కొన్నారు. తంగళ్లపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలోని జిల్లెల్ల వద్ద ఏర్పాటు చేసిన చెక్‌పోస్టును మంగళవారం తనిఖీ చేసిన సందర్భంగా మాట్లాడారు. సరైన ఆధారాలు లేకుండా రూ.50వేల కంటే ఎక్కువ డబ్బు తీసుకెళ్తే సీజ్ చేస్తామని తెలిపారు. అత్యవసర వైద్యం, కళాశాల ఫీజులు, వ్యాపారం, పెళ్లిళ్లు, ఇతర అవసరాలకు డబ్బు తీసుకెళ్తున్న వారు సరైన పత్రాలను వెంట పెట్టుకోవాలని సూచించారు. జిల్లాలో జిల్లెల్ల, గంభీరావుపేట మండలం పెద్దమ్మ స్టేజీ, ముస్తాబాద్ మండలం వెంకట్రామ్‌పల్లి, వేములవాడరూరల్ మండలం ఫాజుల్‌నగర్, బోయినపల్లి మండలం కొదురుపాక, రుద్రంగి మండలం మానాల క్రాస్‌రోడ్డు వద్ద చెక్‌పోస్టులు ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

చినుకు.. వణుకు

● చిన్నపాటి వర్షానికే సిరిసిల్ల చిత్తడి
● రోడ్లపైకి చేరిన మురికినీరు
● స్వచ్ఛ సిరిసిల్ల కీర్తికి విఘాతం
● ఏటా ఇదే పరేషాన్

సాక్షి ఫోకస్



ఇది సిరిసిల్లలోని సంజీవయ్యనగర్ రోడ్డు. పాతబస్టాండు సమీపంలోనే ఉండే ఈ రోడ్డు చిన్నపాటి వర్షం పడితే చ ఆలు మురికి కాల్వల్లోని నీరంతా రోడ్డుపైకి చేరుతుంది. అనంతనగర్, అశోక్‌నగర్ ప్రాంతాల నుంచి వచ్చే మురికినీరు ఇక్కడ రోడ్డుపైకి వస్తుంది. సోమవారం రాత్రి కురిసిన వర్షంతో మురికి నీరు రోడ్డుపైకి రావడంతో సంజీవయ్యనగర్ ప్రధాన రహదారి ఇలా మారింది. ప్రైవేటు ఆస్పత్రులు, దళితకాలనీ వాసులు ఉండే ఈ రోడ్డు పాలకుల నిర్లక్ష్యానికి నిదర్శనంగా నిలుస్తుంది.



ఇది విద్యానగర్‌లోని రవాణాశాఖ(ఆర్‌టీవో) ఆఫీస్ రోడ్డు. మూడో వార్డులోని ఈ రోడ్డు పరిస్థితి ఇదే. మురికికాల్వ పైభాగంలో ఉండడం, సిమెంట్ రోడ్డు కిందకు ఉండడంతో చిన్నపాటి వర్షానికే ఇలా రోడ్డు తయారవుతుంది. రోడ్డుపైకి మురికి చేరడంతో పరిసరాలు దారుణంగా మారుతున్నాయి. ముక్కుపుటాలు అదిరేలా దుర్వాసన వస్తుంది. మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళ వార్డు ఇదే కావడం విశేషం. ఈ రోడ్డు ఎత్తు పెంచేందుకు గతేదాది చేసిన ప్రతిపాదనలు బుట్టదాఖలయ్యాయి. నిధులు లేక పనులు సాగడం లేదు. ఫలితంగా సోమవారం నాటి వర్షానికి 3వ వార్డు రోడ్డు ఇలా మారింది.

సిరిసిల్ల: పారిశుధ్య నిర్వహణ కార్యక్రమాలలో ఆదర్శంగా నిలుస్తున్న సిరిసిల్ల మున్సిపాలిటీలో మౌలిక వసతులు కరువయ్యాయి. చిన్నపాటి వర్షానికే అంతర్గత రహదారులు అధ్వానంగా తయారవుతున్నాయి. రోడ్లపైకి మురికి నీరు చేరి పరిసరాలు దుర్వాసన వస్తున్నాయి. ఏదో వర్షాకాలంలో సమస్య తలెత్తుతుందంటే సర్దుకుపోవచ్చు.. ఎండాకాలంలో కురిసే చిన్నపాటి అకాల వర్షాలకు సైతం జిల్లా కేంద్రం వాసులు వణికిపోతున్నారు.

మసకబారుతున్న స్వచ్ఛ కీర్తి

సిరిసిల్లకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గత ఆరేళ్లుగా స్వచ్ఛ సర్వేక్షణ్ అవార్డులు అందిస్తున్నాయి. ఇంటింటికీ వెళ్లి చెత్త సేకరించడం, రీసైక్లింగ్ చేయడంలో ఆదర్శంగా ఉందని అవార్డులు వరించాయి. కానీ స్వచ్ఛ సిరిసిల్ల కీర్తికి స్థానికంగా ఉన్న డ్రెయినేజీల సమస్య మసకగా నిలుస్తుంది. లక్ష జనాభా ఉన్న సిరిసిల్లను గత మూడేళ్లుగా వరద నీరు ముంచెత్తుతోంది. గతంలో ఇలాంటి సమస్యలు లేవు. గతేడాది బోనాల చెరువు కట్టకు గండి పడడంతో సిరిసిల్ల పట్టనం సగవ వరకు మునిగిపోయింది. ఇలా సిరిసిల్ల పట్టణం చినుకు పడితే వణికిపోతుంది.

చినుకు పడితే చిత్తడే

జిల్లా కేంద్రంలో చినుకు పడితే వీధులు చిత్తడిగా మారుతున్నాయి. సోమవారం ఉరుములు మెరుపులతో కూడిన వర్షం పడగా స్థానిక జూనియర్ కళాశాల మైదానం బురదమయంగా మారింది. సంజీవయ్యనగర్‌తోపాటు నేతన్నసర్కిల్ ప్రాంతాలు మురికి కూపంగా మారాయి. కూరగాయల మార్కెట్ మురికినీటితో కంపు కొట్టింది.

నిధులు రాక.. పనులు సాగక

సిరిసిల్ల పట్టణ అభివృద్ధిలో భాగంగా జీవోఆర్‌టీ నంబరు 476 తేదీ: 18.07.2023, జీవో ఆర్‌టీ నంబరు 841 తేదీ: 08.10.2023న మొత్తం రూ.55 కోట్లు మంజూరు చేశారు. రెండు వేర్వేరు జీవోల ద్వారా మంజూరైన ఈ నిధులతో 39 వార్డుల్లో అభివృద్ధి పనులను మున్సిపల్ అధికారులు ప్రతిపాదించారు. అయితే ఒక్క పని కూడా చేయలేదు. వర్క్ ఆర్డర్ లేని పనులు చేయొద్దని చెప్పడంతో అవి రద్దయ్యాయి. దీంతో సిరిసిల్ల పట్టణాభివృద్ధి ఒక్క అడుగు ముందుకు.. మూడు అడుగులు వెనక్కి అన్నట్లుగా మారింది. ప్రజాప్రతినిధులు, అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి డ్రెయినేజీ సమస్యను శాశ్వత పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.

ఇది సిరిసిల్ల నేతన్నచౌక్ ఎదుట గల సురభి హోటల్ వద్ద కరీంనగర్–కామారెడ్డి ప్రధాన రహదారి దుస్థితి. సోమవారం రాత్రి కురిసిన వర్షంతో వెంకంపేట, సర్దార్‌నగర్ ప్రాంతాల నుంచి వచ్చిన వరదనీరు, మురికినీరు కలిసిపోయి ఇలా రోడ్డుపైకి చేరింది. ఇక్కడ రోడ్డు దిగువకు ఉండడం, మురికి కాల్వ ఎగువన ఉండడంతో చిన్నపాటి వర్షం పడినా.. మున్సిపల్ పారిశుధ్య సిబ్బందికి ఇబ్బంది తప్పదు. ఎండాకాలంలోనూ అకాల వర్షాలతో ఇలా మురికి నీరు రోడ్డుపైకి చేరుతుండడం స్థానికంగా ఉన్న డ్రెయినేజీల దుస్థితికి అద్దం పడుతుంది.



క్లుప్తంగా

హత్యాయత్నానికి పాల్పడిన ఇద్దరిపై కేసు

సారంగాపూర్(జగిత్యాల): బీర్‌పూర్ మండల కేంద్రానికి చెందిన ఓ యువకుడిపై హత్యాయత్నానికి పాల్పడిన ఇద్దరిపై మంగళవారం కేసు నమోదు చేసినట్లు ఏఎస్సై రవీందర్ తెలిపారు. బీర్‌పూర్‌కు చెందిన చంద్రశేఖర్‌పై అదే గ్రామానికి చెందిన మురళి పదునైన ఆయుధంతో, శేఖర్ అనే వ్యక్తి సైతం దాడికి పాల్పడ్డాడు. చంద్రశేఖర్ ఫిర్యాదు మేరకు మురళి, శేఖర్‌పై కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై తెలిపారు.

అసభ్యంగా ప్రవర్తించిన వ్యక్తిపై

సారంగాపూర్(జగిత్యాల): బీర్‌పూర్ మండల కేంద్రంలో మహిళ పట్ల అసభ్యంగా ప్రవర్తించిన వ్యక్తిపై మంగళవారం పోలీసులు కేసు నమోదు చేశారు. ఏఎస్సై రవీందర్ కథనం ప్రకారం.. బీర్‌పూర్‌కు చెందిన మహిళ ఇంట్లోకి అదే గ్రామానికి చెందిన చంద్రశేఖర్ అక్రమంగా ప్రవేశించిన అసభ్యంగా ప్రవర్తించాడు. సదరు మహిళ ఫిర్యాదు మేరకు చంద్రశేఖర్‌పై కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై తెలిపారు.

బెల్టుషాపు నిర్వాహకుడిపై..

రాయికల్(జగిత్యాల): రాయికల్ మండలం కిష్టంపేట గ్రామానికి చెందిన చౌటపల్లి కిరణ్ అక్రమంగా బెల్టుషాపు నిర్వహిస్తుండగా మంగళవారం ఎస్సై అజయ్ ఆధ్వర్యంలో దాడి నిర్వహించారు. రూ.44,400 విలువ గల 79 లీటర్ల మద్యాన్ని జప్తుచేసి కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

వృద్ధుడి ఆత్మహత్య

సైదాపూర్: మండలంలోని పెరుకపల్లిలో పురుగుమందు పోతరాజు ఓదయ్య(85) అనే వృద్ధుడు మృతిచెందినట్లు సైదాపూర్ ఎస్‌ఐ ఆరోగ్యం తెలిపారు. ఓదయ్య భార్య కనకవ్వ రెండు నెలల క్రితం మృతిచెందింది. దీంతో మనోవేదనకు గురయ్యాడు. సోమవారం ఉదయం పురుగుమందుతాగాడు. చికిత్స కోసం వెంటనే హుజూరాబాద్ ప్రభుత్వ ఆస్పత్రికి అటునుంచి మెరుగైన వైద్యం కోసం వరంగల్ ఎంజీఎంకు తరలించగా అదేరోజు సాయంత్రం చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడి కుమారుడు యాదగిరి ఫిర్యాదు మేరకు మంగళవారం కేసు నమోదు చేశామని ఎస్సై వివరించారు.

రేషన్‌బియ్యం పట్టివేత

జగిత్యాలక్రైం: జగిత్యాల రూరల్ మండలం కల్లెడ గ్రామంలో మంచాల అంజయ్య ఇంట్లో రేషన్ బియ్యాన్ని సీజ్ చేసినట్లు రూరల్ ఎస్సై సదాకర్, డీటీసీఎస్ మహేశ్వర్‌రావు తెలిపారు. కల్లెడకు చెందిన అంజయ్య కొంతకాలంగా రేషన్ బియ్యం కొనుగోలు చేస్తున్నాడు. ఈనేపథ్యంలో మంగళవారం అతడి ఇంట్లో ఎస్సై, డీటీసీఎస్ తనిఖీలు చేపట్టారు. 51 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని సీజ్ చేసి అంజయ్యపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. సీజ్ చేసిన రేషన్ బియ్యాన్ని సివిల్ సప్లై గోదాంకు తరలించారు.

మల్యాలలో..

మల్యాల(చొప్పదండి): అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. మల్యాల మండల కేంద్రంలో ఎస్సై అబ్దుల్ రహీం సిబ్బందితో కలిసి మంగళవారం సాయంత్రం వాహనాల తనిఖీ చేపట్టారు. అనుమానాస్పదంగా వెళ్తున్న బొలేరో వాహనాన్ని ఆపి తనిఖీ చేయగా అందులో అక్రమంగా తరలిస్తున్న 34.50క్వింటాళ్ల రేషన్ బియ్యం గుర్తించారు. వాహనాన్ని పోలీస్‌స్టేషన్‌కు తరలించి, నిందితులు బండారి ఎల్లయ్య, వెంకట్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

ధాన్యం రాలింది.. కన్నీరు మిగిలింది

- జిల్లాలో వర్షం నష్టం రూ.2 కోట్లు
- 858 ఎకరాలలో వరిపంట నష్టం
- విరిగిన 10 స్తంభాలు
- పాడయిన మూడు ట్రాన్స్‌ఫార్మర్లు
- అత్యధికంగా ముస్తాబాద్‌లో 11 మిల్లీమీటర్లు
- క్షేత్రస్థాయిలో సర్వే చేపట్టిన అధికారులు


బట్టోనితాళ్లలో రైతులతో మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయాధికారి భాస్కర్


పోతుగల్ హాస్టల్‌లో కూలిన చెట్టు


తంగళ్లపల్లిలో పొలంలో రాలిన వడ్లు

ముస్తాబాద్(సిరిసిల్ల): చేతికొస్తుందనుకున్న పంట కళ్లెదుటే నేలరాలడం.. కంటికి రెప్పలా కాపాడుకున్న పంట ప్రకృతి ప్రకోపానికి చేతికి రాకుండా పోవడంతో జిల్లాలోని రైతులు కన్నీరు పెడుతున్నారు. ఆరుగాలం శ్రమించి పండించిన పంటను వడగండ్ల వాన ఊడ్చుకుపోవడంతో రైతులు గుండెలవిసేలా రోదిస్తున్నారు. పెట్టుబడి, రెక్కలకష్టం నేలపాలైందని కన్నీటిపర్యంతమవుతున్నారు. జిల్లాలో సోమవారం సాయంత్రం ఈదురుగాలులతో కూడిన వడగండ్ల వానకు వరిపంటకు తీవ్ర నష్టం జరిగింది. విద్యుత్ స్తంభాలు కూలిపోగా, ట్రాన్స్‌ఫార్మర్లు పాడయ్యాయి. మొత్తంగా జిల్లా వ్యాప్తంగా రూ.2కోట్ల నష్టం ఏర్పడింది.

నష్టం అపారం

వడగండ్ల వానకు జరిగిన నష్టాన్ని జిల్లా వ్యవసాయాధికారి భాస్కర్, ఏవో వెంకటేశ్, ఏఈవోలు మంగళవారం పరిశీలించారు. ముస్తాబాద్, పోతుగల్, గన్నెవారిపల్లె, బట్టోనితాళ్లు, తెర్లుమద్ది, గూడెం, మొర్రాయిపల్లె గ్రామాల్లో దెబ్బతిన్న పంటలపై సర్వే చేశారు. ముస్తాబాద్ మండలంలో 580 ఎకరాలలో వరిపంట దెబ్బతిందని, అధికారులకు దీనిపై నివేదిక ఇస్తామని డీఏవో భాస్కర్ తెలిపారు. బందనకల్, తెర్లుమద్దిలో మామిడిపంటలు దెబ్బతిన్నాయని రైతులు అధికారుల దృష్టికి తెచ్చారు. కాగా 580 ఎకరాలలో వరిపంట దెబ్బతినగా రూ.1.10 కోట్ల నష్టం జరిగినట్లు ప్రాథమికంగా అంచనా వేశారు. అలాగే విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు, స్తంభాలు పడిపోగా రూ.20లక్షల నష్టం జరిగినట్లు విద్యుత్‌శాఖ అధికారులు భావిస్తున్నారు.

కరెంట్ వ్యవస్థ అస్తవ్యస్తం

ఈదురుగాలులకు స్తంభాలు విరిగిపోవడంతో సోమవారం రాత్రి నుంచి మంగళవారం తెల్లవారే వరకు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. దెబ్బతిన్న పోల్స్‌ను విద్యుత్‌శాఖ అధికారులు, సిబ్బంది సరిచేస్తున్నారు. ముస్తాబాద్, పోతుగల్, గన్నెవారిపల్లెలో కూలిన పది విద్యుత్ స్తంభాలను బాగు చేశారు. మరో మూడు విద్యుత్ ట్రాన్స్‌పార్మర్లు కాలిపోయాయని డైరెక్టర్ అంజిరెడ్డి, ఏఈ విష్ణుతేజ తెలిపారు. సోమవారం అర్ధరాత్రి వరకు సిబ్బంది మరమ్మతు పనులు చేశారు. ముస్తాబాద్ కొత్తబస్టాండ్‌లో విద్యుత్ పోల్ పడిపోయి సరఫరా నిలిచిపోయింది. పంచాయతీ సిబ్బంది, సెస్ సిబ్బంది రోజంతా కష్టపడి చెట్లనుతొలగించి, కరెంట్ సరఫరాను పునరుద్ధరించారు. పోతుగల్ బాలుర సాంఘిక సంక్షేమ వసతి గృహంలో చెట్టు పడిపోగా ప్రహరి కూలింది. పోతుగల్ శివారులో సిరిసిల్ల రహదారిపై చెట్టు పడిపోయింది.


ముస్తాబాద్‌లో పరిశీలిస్తున్న వినోద్‌కుమార్


పంటలను పరిశీలిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

తంగళ్లపల్లిలో 278 ఎకరాలలో పంట నష్టం

తంగళ్లపల్లి(సిరిసిల్ల): తంగళ్లపల్లి మండలంలో ఈదురుగాలులు, వడగండ్ల వానకు వరి, మామిడి తోటలకు తీవ్ర నష్టం ఏర్పడింది. మండలంలోని తంగళ్లపల్లి, ఓబులాపూర్, రాళ్లపేట, అంకిరెడ్డిపల్లె, వేణుగోపాలపూర్, గండిలచ్చపేట, మండెపల్లి, కస్బెకట్కూర్, రామన్నపల్లె, నర్సింహులపల్లె, మండెపల్లి గ్రామాల్లో 278 ఎకరాల్లో వరిపంటకు నష్టం జరగగా.. సుమారు 50 ఎకరాల్లో మామిడి తోటలు దెబ్బతిన్నాయి. దెబ్బతిన్న పంటలను బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు గజభీంకార్ రాజన్న, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు ప్రవీణ్ జే టోని తమ పార్టీ నాయకులతో వేర్వేరుగా పరిశీలించారు. పంట నష్టాన్ని డీఏవో భాస్కర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. మండలంలో 278 ఎకరాల్లో వరిపంట పాడైనట్లు ప్రాథమిక అంచనాకు వచ్చినట్లు తెలిపారు. మండల ఏవో సందీప్, ఏఈవో చంద్రప్రకాశ్, కరుణాకర్ ఉన్నారు.

జిల్లాలో అకాల వర్షాలు

సిరిసిల్ల: జిల్లాలో సోమవారం రాత్రి నుంచి మంగళవారం తెల్లవారుజాము వరకు అకాల వర్షం కురిసింది. ముస్తాబాద్ మండలంలో అత్యధికంగా 11 మిల్లీమీటర్లు పడగా.. గంభీరావుపేట, వీర్నపల్లి మండలాల్లో వర్షం పడలేదు. రుద్రంగిలో 4 మిల్లీమీటర్లు, చందుర్తిలో 2.9, వేములవాడ రూరల్‌లో 0.5, బోయినపల్లిలో 1.2, వేములవాడలో 1.7, సిరిసిల్లలో 8.5, కోనరావుపేటలో 0.5, ఎల్లారెడ్డిపేటలో 0.5, తంగళ్లపల్లిలో 2.9, ఇల్లంతకుంటలో 1.2 మిల్లీమీటర్ల వర్షం పడింది.


రాలిపోయిన మామిడికాయలను చూపుతున్న రైతు బాల్‌రెడ్డి

పేకాటస్థావరంపై దాడి.. రూ.14.48లక్షలు స్వాధీనం

- 10 మంది పేకాటరాయుళ్ల అరెస్ట్
- రామగుండం సీపీ శ్రీనివాస్



వివరాలు వెల్లడిస్తున్న సీపీ శ్రీనివాస్

గోదావరిఖని: పేకాటస్థావరంపై టాస్క్‌ఫోర్స్ పోలీసులు ఆకస్మిక దాడిచేసి భారీగా నగదు స్వాధీనం చేసుకున్నట్లు రామగుండం పోలీసు కమిషనర్ శ్రీనివాస్ తెలిపారు. మంగళవారం సీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. కమిషనరేట్ పరిధిలోని మంచిర్యాల జిల్లా చెన్నూరు మండలం అస్నాద గ్రామ శివారు మామిడితోటలో కొందరు డబ్బులు పెట్టి మూడుముక్కలాట ఆడుతున్నారన్న సమాచారం మేరకు టాస్క్‌ఫోర్స్ సీఐ సంజీవ్ ఆధ్వర్యంలో దాడి చేశారన్నారు. ఈ సందర్భంగా 10 మంది పేకాటరాయుళ్లను అదుపులోకి తీసుకున్నారని, వారినుంచి 10 సెల్‌ఫోన్లు రూ.14.48లక్షల నగదు, పేకముక్కలు స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేశామని వివరించారు. కొందరు ముఠాగా ఏర్పడి పెద్దపల్లి, మంచిర్యాల, వరంగల్, కరీంనగర్, ఆసిఫాబాద్, ఏరియాల నుంచి పేకాటరాయుళ్లను పిలిపించుకుని పేకాట ఆడుతున్నట్లు వివరించారు. కొంత పెట్టుబడి పెట్టి, అటవీ ప్రాంతాల్లో రోజుకు ఒక ఏరియాలో పేకాటస్థావరాలు ఏర్పాటుచేసి, ఆటగాళ్ల నుంచి పెద్దమొత్తంలో వసూలు చేస్తున్నారని అన్నారు. మహారాష్ట్ర సరిహద్దు ప్రాంతంలో స్థావరాలు ఏర్పాటు చేసుకొని పేకాట నిర్వహిస్తున్నారన్నారు. టాస్క్‌ఫోర్స్ పోలీసుల దాడిలో పట్టుపడిన వారు మంచిర్యాల, చెన్నూర్ మండలం నాగాపురం, గోదావరిఖని మల్కాపురం, హనుమాన్‌నగర్, మంచిర్యాల జిల్లా వేంపల్లి, వరంగల్ పోర్ట్, కొలనూరు, రెబ్బన, సీసీసీ నస్పూర్‌కు చెందిన వారు ఉన్నారని సీపీ వివరించారు.

రూ.2 లక్షలు పట్టుకున్న పోలీసులు


పట్టుకున్న వాహనంతో పోలీసులు, వ్యక్తులు

ధర్మారం(ధర్మపురి): పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో పెద్దపల్లి జిల్లా ధర్మారం మండలం జక్కన్నపల్లి గ్రామంలో మంగళవారం పోలీసులు వాహనాలు తనిఖీ చేశారు. ఈసందర్భంగా రూ.2,80,000 నగదు లభించినట్లు ఎస్సై సత్యనారాయణ తెలిపారు. చెక్‌పోస్టు వద్ద బొలేరో వాహనం తనిఖీ చేయగా దరావత్ ఠాకూర్, లోకవత్ దేవేందర్ వద్ద రూ.55,000 లభించాయని, వీటికి ఆధారాలు చూపలేదన్నారు. అదేవిధంగా మరో బొలేరో వాహనంలో చొప్పదండికి చెందిన అంజయ్య, కుమార్, మల్లయ్య, అంజయ్య, లచ్చయ్య వెళ్తుండగా తనిఖీ చేశామన్నారు. ఇందులో రూ.2.25లక్షల నగదు లభించిందని, వీటికి ఆధారాలు చూపలేదని తెలిపారు. ఈ సొమ్మును ఎఫ్ఎస్‌టీ బృందానికి అప్పగించినట్లు ఎస్సై వివరించారు. తనిఖీల్లో ధర్మారం ఎస్సై- 2 అశ్విని, పోలీసులు పాల్గొన్నారు.

బయట తినొద్దన్నందుకు ఇంటర్ విద్యార్థి ఆత్మహత్య


మృతి చెందిన విద్యార్థి

గోదావరిఖని: పవిత్ర రంజాన్ సందర్భంగా బయటి తిండి తొనిద్దని తండ్రి మందలించినందుకు మనస్తాపం చెందిన ఇంటర్ విద్యార్థి ఎండీ సాహిజాద్(17) ఆత్మహత్య చేసుకున్నాడు. పెద్దపల్లి జిల్లా గోదావరిఖనిలోని గాంధీనగర్‌లో ఈ సంఘటన చోటుచేసుకుంది. గోదావరిఖనిలోని ఓ ప్రైవేట్ కళాశాలలో సాహిజాద్ ఇటీవల ఇంటర్ ప్రథమ సంవత్సరం పూర్తిచేశాడు. తరచూ బయటి తిండి తినడంతో తండ్రి గట్టిగా మందలించాడు. మనస్తాపం చెందిన సాహిజాద్ చున్నీతో తన ఇంట్లో ఉరివేసుకున్నాడు. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ప్రకటించారు. మృతుడి తండ్రి తాజుద్దీన్ ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసుకున్నట్లు గోదావరిఖని వన్‌టౌన్ రెండో సీఐ రవీందర్ తెలిపారు.

సిరిసిల్ల వాసికి అయోధ్య రామయ్య వెండి నాణెం


ప్రకాశ్ అందుకున్న అయోధ్య బాలరాముడి వెండి నాణెం

సిరిసిల్లటౌన్: రాజన్నసిరిసిల్ల జిల్లా కేంద్రానికి చెందిన నాణేల కలెక్షన్ కింగ్ బుడిమె ప్రకాశ్ మరో అరుదైన నాణెం సొంతం చేసుకున్నారు. ఇటీవల అయోధ్య బాలరాముడి ఆలయం ప్రారంభంకాగా.. కోల్‌కత మింట్ ఆధ్వర్యంలో ఫిబ్రవరి మొదటి వారంలో ఆలయ ప్రాశస్త్యం, చరిత్రలో నిలిచేలా వెండి నాణెం తయారు చేశారు. వివిధ పత్రికల్లో నోటిఫికేషన్‌ను చూసిన ప్రకాశ్ ఫిబ్రవరి 16న కోల్‌కత మింట్‌కు ఆన్‌లైన్‌లో రూ.5,092 చెల్లించాడు. ఇందుకుగాను మంగళవారం రామ్‌లల్లా ప్యూర్ సిల్వర్ కాయిన్ ప్రకాశ్‌కు అందింది. ఇది 50 గ్రాముల ప్యూర్ సిల్వర్‌తో తయారైంది.

ఇసుక లారీల పట్టివేత

కాల్వశ్రీరాంపూర్(పెద్దపల్లి): పెద్దరాతుపల్లి, కిష్టంపేట, మీర్జంపేట గ్రామాల నుంచి అనుమతులు లేకుండా ఇసుక రవాణా చేస్తున్న లారీలను పోలీసులు మంగళవారం పట్టుకున్నట్లు సమాచారం. ఈవిషయమై ఎస్సై ఓంకార్ యాదవ్‌ను వివరణ కోరగా పెద్దరాతుపల్లి మానేరు నది నుంచి ఇసుక అక్రమంగా రవాణా చేస్తున్నారనే పక్కా సమాచారంతో తనిఖీలు చేసి లారీలను సీజ్‌చేసినట్లు వివరించారు. లారీ డ్రైవర్లు, ఓనర్లను బైండోవర్ చేశామని పేర్కొన్నారు. మైనింగ్ అధికారులకు సమాచారం ఇచ్చామని ఎస్సై తెలిపారు.

పందెం కోళ్ల విక్రయం

శంకరపట్నం: మండలంలోని మొలంగూర్ శివారులో మహారాష్ట్రకు చెందిన ఆయుర్వేద హనుమాన్ సంచార జాతులువారు మంగళవారం పందెం కోళ్లను విక్రయించారు. ఒక్కో కోడి ధర రూ.మూడువేల నుంచి నాలుగు వేల వరకు పలికింది. కొంతమంది మాంసం ప్రియులు పందెం కోళ్లను కొనుగోలు చేసి ఆరగించాలన్న ఆసక్తితో ధరను లెక్క చేయకుండా కొనుగోలు చేశారు.

విద్యార్థులపై వేడినీళ్లు పడిన సంఘటనపై విచారణ

జమ్మికుంట: మండలంలోని గండ్రపల్లి గ్రామ శివారులోని తెలంగాణ సాంఘిక గురుకుల(బాలికల) పాఠశాలలో విద్యార్థులపై వేడినీళ్లు పడి సంఘటనపై కరీంనగర్ రీజినల్ కోఆర్డినేటర్ లక్ష్మాంజలి, డీసీవో శ్రీనివాస్‌రెడ్డి మంగళవారం విచారణ చేపట్టారు. వేడినీళ్లు పడి తీవ్రగాయాలైన విద్యార్థులు, తండ్రులు, ఉపాధ్యాయులు, కేర్ టేకర్ రమ్య, అసిస్టెంట్ కేర్ టేకర్ రేణుక, ఉపాధ్యాయులు, క్లాస్‌లీడర్లను విడివిడిగా విచారించి సంఘటనపై వివారాలు సేకరించారు. ఉన్నతాధికారులకు వివరాలు తెలియజేసి చర్యలు తీసుకుంటామని డీసీవో తెలిపారు. వైద్యఖర్చులకు స్కూల్ ఫండ్ అందజేయాలని ఇన్‌చార్జి ప్రిన్సిపల్ సత్యప్రియను ఆదేశించారు. విచారణలో వైస్‌ప్రిన్సిపల్ పరిమళవాణి, పేరెంట్స్ కమిటీ సభ్యులు ఉన్నారు.

హత్య కేసులో ఇద్దరికి యావజ్జీవ శిక్ష

జగిత్యాలజోన్: తనతో గొడవపడ్డ వ్యక్తిని చంపేందుకు వెళ్లగా, సదరు వ్యక్తి పారిపోవడంతో ఆ కారణంగా అతడి స్నేహితుడిని హత్య చేసిన కేసులో నిందితులైన ఇద్దరికి యావజ్జీవశిక్ష, ఒక్కొక్కరికి రూ.5 వేల జరిమానా విధిస్తూ జగిత్యాల మొదటి అదనపు జిల్లా జడ్జి సుగలి నారాయణ మంగళవారం తీర్పు చెప్పారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ కాసారపు మల్లేశం కథనం ప్రకారం.. వెల్గటూర్ మండలం ముత్తునూర్‌కు చెందిన బైరం దామోదర్, సింగం రాజయ్య స్నేహితులు. అయితే, సాగు నీటి విషయంలో సింగం రాజయ్య, సీపతి ప్రభాకర్ మధ్య గొడవ జరుగగా, ప్రభాకర్ తలకు గాయాలైనాయి. దీంతో రాజయ్యపై కేసు నమోదైంది. అయినా రాజయ్యను ఎలాగైన చంపాలని ప్రభాకర్ తన మిత్రుడైన నేరేళ్ల రాజుతో కలిసి ప్రణాళిక రూపొందించాడు. ఈ నేపథ్యంలో 2009 డిసెంబర్ 24న రాజయ్య తన పొలం నుంచి ఇంటికి వస్తుండగా, గ్రామ శివారులో మాటు వేసిన ప్రభాకర్, రాజు వెంబడించడంతో అతను తప్పించుకుని ఊర్లోకి వెళ్లిపోయాడు. అయితే, అదే సమయంలో రాజయ్య స్నేహితుడు బైరం దామోదర్ కూలీలతో కలిసి ఎడ్లబండిపై ఊర్లోకి వెళ్తున్నాడు. అప్పటికే ఆవేశంతో రగిలిపోతున్న ప్రభాకర్, రాజుకు దామోదర్ కనబడటంతో కత్తులతో దాడి చేసి హత్య చేశారు. ఎడ్లబండిలో ఉన్న కూలీలు భయభ్రాంతులతో తలోవైపు పరిగెత్తారు. మృతుడి అన్న బైరి లచ్చయ్య పోలీసులకు ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసుకున్నారు. అప్పటి డీఎస్పీ దామెర నర్సయ్య నిందితులిద్దరిని అరెస్ట్ చేసి కోర్టులో చార్జీషీట్ దాఖలు చేశారు. కోర్టు మానిటరింగ్ అధికారులు జి.కిరణ్‌కుమార్, ఎం.కిరణ్‌కుమార్, వి.శ్రీధర్ సాక్ష్యాలను కోర్టులో ప్రవేశపెట్టడంతో న్యాయమూర్తి పరిశీలించారు. అనంతరం సీపతి ప్రభాకర్, నేరేళ్ల రాజుకు యావజ్జీవశిక్ష, జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారు.

27 నుంచి శివకల్యాణోత్సవాలు

వేములవాడ: శ్రీరాజరాజేశ్వరస్వామి దేవస్థానంలో ఈనెల 27 నుంచి 31వ తేదీ వరకు ఐదు రోజులపాటు రాజన్న బ్రహ్మోత్సవాలు నిర్వహించేందుకు ఆలయ అధికారులు సన్నాహాలు పూర్తి చేస్తున్నట్లు ఈవో కృష్ణప్రసాద్ తెలిపారు. ఐదు రోజులపాటు ఆర్జిత సేవలు నిలిపివేస్తున్నట్లు ప్రకటించారు. కల్యాణం రోజు కోడెమొక్కుల టికెట్లు మధ్యాహ్నం మూడు గంటల నుంచి ఇవ్వనున్నట్లు చెప్పారు. మహాశివరాత్రి మహోత్సవాలు ముగిసిన తర్వాత శివకల్యాణోత్సవం నిర్వహించుకోవడం ఇక్కడ ఆనవాయితీగా వస్తోందన్నారు. 28వ తేదీన పార్వతీరాజరాజేశ్వరస్వామి వారి కల్యాణోత్సవం వైభవంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. 28 సాయంత్రం ఉత్సవమూర్తుల రథోత్సవం, 31న అవబృతస్నానం, త్రిశూల యాత్ర, ఏకాదశవరణములతో ఉత్సవాలు ముగుస్తాయని వివరించారు. రాష్ట్రంలోని మిగతా శైవక్షేత్రాలలో 'కారణాగమము' అనుసరించి మహాశివరాత్రి పర్విదినం రోజునే కల్యాణోత్సవాలు, బ్రహ్మోత్సవాలు నిర్వహించుకుంటారని ఆలయన అర్చకులు తెలిపారు. కానీ వేములవాడ రాజన్న ఆలయంలో మాత్రం 'స్మార్థ వైదిక' పద్ధతిని అనుసరించి మహాశివరాత్రి జాతర అనంతరం కామదహనం మరుసటి రోజున శివ కల్యాణం నిర్వహించుకుంటామని వివరించారు.

దేవుని భూమి కబ్జాపై చర్యలేవి?


మాట్లాడుతున్న గుంటి వేణు

సిరిసిల్లటౌన్: దేవాలయం భూమిలో వెంచర్ వేస్తూ..ప్లాట్లను విక్రయించుకోవాలని చూస్తున్న వారిపై అధికారులు చర్యలు ఎందుకు తీసుకోవడం లేదని సీపీఐ జిల్లా కార్యదర్శి గుంటి వేణు ప్రశ్నించారు. సిరిసిల్లలోని కార్మిక భవనంలో మంగళవారం విలేకరులతో మాట్లాడారు. శాంతినగర్ శివారులోని విశ్వనాథస్వామి ఆలయానికి సంబంధించిన భూమిలో కొందరు నాయకులు కబ్జాకు పాల్పడ్డారని ఆరోపించారు. దేవాదాయ అధికారులు సైతం మూడు గుంటల భూమి కబ్జాకు గురైందని చెబుతున్నారన్నారు. 27 ఫీట్ల రోడ్డును 40 ఫీట్లుగా చూపిస్తూ అక్రమంగా లేఅవుట్ చేశారన్నారు. దీనికి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరారు. వేణు, నాగరాజు ఉన్నారు.

ఆరోగ్య మహిళకు స్పందన


పరీక్షలు చేస్తున్న వైద్యసిబ్బంది

సిరిసిల్లటౌన్: రాష్ట్ర సర్కారు ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న 'ఆరోగ్యమహిళ' కార్యక్రమాన్ని ప్రతివారం నిర్వహిస్తున్నట్లు డీఎంహెచ్‌వో సుమన్ మోహన్‌రావు తెలిపారు. జిల్లా వైద్యారోగ్యశాఖ చేపట్టిన 'ఆరోగ్య మహిళ' శిబిరానికి స్పందన వస్తుందన్నారు. సిరిసిల్లలోని పీఎస్‌నగర్, వేములవాడ పీఏసీ, నేరెళ్ల పీహెచ్‌సీ, తంగళ్లపల్లి పీహెచ్‌సీలలో మహిళలకు ఉచితంగా వైద్యారోగ్య పరీక్షలు నిర్వహించారు. జిల్లావ్యాప్తంగా వివిధ హెల్త్‌సెంటర్లలో నిర్వహించిన ఆరోగ్య మహిళ శిబిరాల్లో ఓపీడీ (619), ఓరల్ కావిటీ(619), బ్రెస్ట్(523) పరీక్షలు చేసినట్లు తెలిపారు. యూటీఐ(8), సూక్ష్మ పోషకాలు(84), థైరాయిడ్(61), విటమిన్ డీ(58), సీబీపీ(102) పరీక్షలు చేసి ముగ్గురిని జిల్లా ఆస్పత్రికి రెఫర్ చేసినట్లు వివరించారు. ఆయా ఆరోగ్య కేంద్రాల మెడికల్ ఆఫీసర్లు పాల్గొన్నారు.

విడాకులు ఇచ్చిన భర్తపై యాసిడ్ దాడి


గాయపడిన మహేశ్

ఇబ్రహీంపట్నం(కోరుట్ల): విడాకులు ఇచ్చిన భర్త మరో పెళ్లి చేసుకోకుండా ఉండేందుకు మాజీ భార్య యాసిడ్‌తో దాడి చేసిన ఘటన జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం మండలం ఎర్దండి గ్రామంలో జరిగింది. గ్రామస్తులు, పోలీసుల కథనం ప్రకారం.. ఎర్దండికి చెందిన నిరేటి మహేశ్ ఆదిలాబాద్ జిల్లాలో ఓ ప్రైవేటు సీడ్ కంపెనీలో సెల్స్ మేజేజర్‌గా పనిచేస్తున్నాడు. ఎనిమిదేళ్ల క్రితం మెట్‌పల్లి మండలం జగ్గాసాగర్ గ్రామానికి చెందిన మాస లక్షణతో వివాహం జరిగింది. వీరికి నాలుగేళ్ల వయస్సు గల పాప ఉంది. పెళ్లి అయినప్పటి నుంచి తరచూ మనస్పర్థలు రావడంతో 11 అక్టోబర్ 2023న విడాకులు తీసుకున్నారు. కాగా మహేశ్ మరో పెండ్లి చేసుకునేందుకు నిర్ణయించుకొని ఏర్పాట్లు చేస్తుండగా.. అతడికి పెండ్లి కాకుండా ఉండేందుకు ఎదైన హాని చేయలనే ఉద్దేశంతో మంగళవారం ఉదయం లక్షణ ఎర్దండికి వచ్చింది. మహేశ్ ఇంట్లో నుంచి బయటకు రాగానే యాసిడ్ బాటిల్‌తో దాడి చేసింది. మహేశ్‌కు వీపు, ఎడమ కన్ను పై భాగంలో గాయాలైనాయి. చికిత్స నిమిత్తం మెట్‌పల్లి ఆసుపత్రికి తరలించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు లక్షణపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ అనిల్ తెలిపారు.

దావత్ కోసం పిలిచి దాడి చేసి

- ఫేస్‌బుక్ పరిచయంతో సిరిసిల్లకు వచ్చిన యువకుడు
- స్నేహం ముసుగులో దాడి చేసిన వైనం
- ఇద్దరి రిమాండ్

సిరిసిల్లక్రైం: ఫోన్‌లో ఏర్పడ్డ పరిచయంతో దావత్ చేసుకుందామని పిలిచి దాడి చేసిన ఇద్దరిని పోలీసులు రిమాండ్‌కు తరలించారు. సిరిసిల్లటౌన్ సీఐ రఘుపతి తెలిపిన వివరాలు. మేడ్చల్ జిల్లా మల్కాజ్‌గిరి మండలం బొల్లారం గ్రామానికి చెందిన ముక్క శ్రీనివాస్‌కు రాజన్నసిరిసిల్ల జిల్లా వేములవాడలోని చింతల్‌ఠాణాకు చెందిన సూర దేవయ్యతో ఫేస్‌బుక్‌లో పరిచయం ఏర్పడింది. దావత్ చేసుకుందామని ఈనెల 17న బొల్లారం నుంచి ముక్క శ్రీనివాస్‌ను సిరిసిల్లకు పిలిపించారు. సూర దేవయ్య, సూర నరేశ్ సిరిసిల్ల బస్టాండ్‌కు వచ్చి శ్రీనివాస్‌ను బైక్‌పై ఎక్కించుకొని బైపాస్‌రోడ్డుకు తీసుకెళ్లారు. ఓ ప్రాంతంలో బైక్ ఆపి శ్రీనివాస్‌పై దాడి చేసి రూ.3వేలు లాక్కున్నారు. బాధితుడు శ్రీనివాస్ ఫిర్యాదుతో కేసు దర్యాప్తు ప్రారంభించారు. మంగళవారం చంద్రంపేట క్రాసింగ్ వద్ద సూర దేవయ్య, సూర నరేశ్‌లను పట్టుకుని వారి నుంచి నగదు, సెల్‌ఫోన్ సీజ్ చేసి రిమాండ్ పంపారు.